యువత చేతిలోనే భవితవ్యం

- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పెరిగిన యువ ఓటర్లు
- కొనసాగుతున్న ఫారం-6 క్లెయిమ్‌ల స్వీకరణ
- అభివృద్ధి, సంక్షేమానికే మా ఓటు అంటున్న ఓటర్లు



ఓటరు జాబితా

రాయదుర్గం: ఐదేళ్లకోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల భవితవ్యం యువత చేతిలోనే ఉంటుంది. ఆదిశగా కేంద్ర ఎన్నికల కమిషన్ కూడా ప్రత్యేక చర్యలు చేపట్టింది. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు చేసుకొని, ఆ హక్కును వినియోగించుకునేందుకు అధికార యంత్రాంగం చైతన్యం తీసుకొచ్చింది. అవగాహన కార్యక్రమాలకూ శ్రీకారం చుట్టింది. సాధారణ ఎన్నికల షెడ్యూల్ తేదీ మరికొద్ది రోజుల్లోనే విడుదలయ్యే అవకాశం ఉండడంతో అధికారుల్లో హడావుడి నెలకొంది. అధికార యంత్రాంగం ఇప్పటికే ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టగా, తాజాగా పోలింగ్ శాతం పెంపు లక్ష్యంగా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఈ సారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను శాసించేది యువతే. తాజా ఓటరు జాబితా ప్రకారం మూడు నియోజకవర్గాల్లోనూ 7,12,095 మంది ఉన్నారు. వీరిలో 20- 39 ఏళ్లలోపు 3.55 లక్షల మంది ఉంటే, 18-19 ఏళ్లలోపు వారు 14 వేల మంది ఓటర్లు ఉండడం గమనార్హం. ఈ లెక్కన రాజకీయ పార్టీలు యువ ఓటర్లను ఆకట్టుకునేలా కృషి చేస్తున్నారు. సుమారు 80 నుంచి 90 శాతం ఓట్లు 50 ఏళ్లలోపు వయసు కలిగిన వారుంటే, 39 ఏళ్లలోపు సుమారు 48 శాతం మంది ఉన్నారు. ఫారం-6 క్లెయిమ్‌ల స్వీకరణ కొనసాగుతుండడంతో ఎన్నికల నాటికి యువ ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా పటిష్ట ప్రణాళికలను అమల్లోకి తీసుకొచ్చింది. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఈవీఎం లపై అవగాహన కార్యక్రమాలు చేపట్టగా తాజాగా పోలింగ్ పెంపే లక్ష్యంగా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

మొదలైన ఎన్నికల సందడి..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన 816 పోలింగ్ స్టేషన్లలో ఇప్పటికే మౌలిక సౌకర్యాలపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఈవీఎంల భద్రత కోసం స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు, వాటిని పోలింగ్ భూత్‌లకు చేర్చేందుకు బస్సుల సంఖ్య, రూట్ల ఎంపికపై ప్రణాళికలు పూర్తి చేశారు. సెక్టోరియల్, సూక్ష్మ పరిశీలనకు, రూట్ అధికారులు, పోలింగ్ భూత్‌లలో అవసరమయ్యే ఎన్నికల సిబ్బంది ఎంపిక దాదాపు పూర్తకావచ్చింది. అధికారులు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు కృషి చేస్తున్నారు.

వయసు వారీగా ఓటర్లు ఇలా..

వయసు	కళ్యాణదుర్గం	రాయదుర్గం	ఉరవకొండ	మొత్తం
18-19	3,980	5,397	4,333	13,710
20-29	41,782	50,026	38,247	1,30,055
30-39	75,999	77,699	72,077	2,25,775
40-49	44,910	50,016	45,156	1,40,082
50-59	30,588	37,039	31,146	98,773
60-69	19,039	21,835	20,100	60,974
70-79	9,048	10,806	9,580	29,434
80-89	2099	2851	2279	7,229
90-99	272	417	355	1044
100-109	06	03	10	19

అభివృద్ధికి పట్టం కడతాం



18 ఏళ్లు నిండడంతో నాకు ఓటు హక్కు తొలిసారి కల్పించారు. తొలి ఓటు పేదల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేసే నాయకులకే వేస్తా. యువత మేలు కోరే పార్టీకి మద్దతుగా నిలుస్తా. భవిష్యత్తులో అన్ని విధాలా మేలు చేకూర్చే పార్టీని ఎంపిక చేసుకుంటా.

– ఎం.విజయ్‌కుమార్, యువ ఓటరు, రాయదుర్గం

తొలిసారి ఓటేయడం సంతోషం



వచ్చే ఎన్నికల్లో నా తొలి ఓటు సద్వినియోగం చేసుకుంటా. 18 ఏళ్లు నిండిన నాకు ఓటు హక్కు కల్పించారు. జాబితాలో పేరు కూడా వచ్చింది. మంచి పాలన, నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించి అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే పార్టీకే మద్దతుగా ఉంటా. అన్ని విధాలా ఆలోచించి మంచిచేసే నాయకత్వానికే నా ఓటు వేస్తా.

– జానకి, యువ ఓటరు, రాయదుర్గం

సిద్ధం' సభకు తరలిన జగన్ సైన్యం

- రాప్తాడు సిద్ధం సభకు స్వచ్ఛందంగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు, ప్రజలు



రాయదుర్గం: జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న సమన్వయకర్త మెట్టు



రాయదుర్గం: పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న మెట్టు

రాయదుర్గం: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభకు నియోజకవర్గ నుంచి జగనన్న సైన్యం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లింది. అర్బన్‌తోపాటు డీహీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల నుంచి 220 బస్సులు, వందల సంఖ్యలో కార్లు, టాటా మ్యాజిక్‌లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బయల్దేరి వెళ్లారు. అంతకు ముందు శ్రేణులతో కలసి 'మెట్టు' ద్వామా కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు.

పార్టీ శ్రేణుల్లో జోష్ నింపిన జగన్ ప్రసంగం

రాప్తాడు సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన ప్రతిమాటా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణుల్లో రెట్టింపు జోష్ నింపింది. 2019లో ఇచ్చిన మేనిఫేస్టో చూపి 2024లో చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమంపై ఇంటింటా వివరించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన మోసాలు, దగా, వెన్నుపోట్లపై ప్రజలకు తెలియజేప్పేలా కసరత్తు మొదలుపెట్టింది.

కణేకల్లు నుంచి ..

కణేకల్లు: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభకు కణేకల్లు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. అన్నీ గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు బస్సులు, కార్లు, క్రూజర్ వాహనాల్లో బయలుదేరారు. మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, కణేకల్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ చెన్నకేశవ రెడ్డి, కళేకుర్తి జయరామిరెడ్డి,ఆర్కే బద్రీ, యంద్రకాయల వన్నూరప్ప, హనుమంతరావు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ నుంచి..

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గం వ్యాప్తంగా వందలాది వాహనాల్లో ఎంపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్యకర్తలు రాప్తాడు సిద్ధం సభకు వెళ్లారు. గ్రామీణ ప్రాంతాలల్లో నుంచి వెళ్లే నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

శెట్టూరు నుంచి..

శెట్టూరు: మండలంలోని శెట్టూరు, అయ్యగార్ల పల్లి, ఐదుకల్లు, యాటకల్లు, చిన్నంపల్లి, బచ్చేహళ్లి, కైరేవు, చెర్లోపల్లి, లక్ష్మంపల్లి, మాకోడికి, చింతర్లపల్లి, కనుకూరు, ములకలేడు, పెరుగుపాళ్యం, తిప్పనపల్లి, అనుంపల్లి గ్రామాల నుంచి సిద్ధం సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజునాథ, కన్వీనర్ శివన్న, యాదవ్, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు తిప్పేస్వామి, ఎమ్మెస్ రాయుడు, రామకృష్ణ, బొమ్మజ్జి రమేష్, చెవుల కిష్టప్ప, ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు, డీలర్లు, మహిళలు తరలివెళ్లారు.

కంబదూరు నుంచి...

కంబదూరు: రాప్తాడు వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభకు మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల వ్యాప్తంగా ఉన్న 12 గ్రామ పంచాయతీల నుంచి ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో బస్సులు, వివిధ వాహనాల్లో వేలాదిగా వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు తరలివెళ్లారు.

300 వాహనాల్లో తరలిన ప్రజలు

ఉరవకొండ: రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు 300 వాహనాల్లో ఆదివారం తరలివెళ్లారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు మేరకు బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో పార్టీ శ్రేణులు వెళ్లారు. పట్టణంలో 20 వార్డుల నుంచి ప్రజలు వెళ్లారు.

18 యుకెడి 02ఎ: ఉరవకొండ నుంచి సభకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

వజ్రకరూరు నుంచి..

వజ్రకరూరు: మండలంలోని గ్రామాల నుంచి సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యక ర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు.

'సిద్ధం' సభకు తరలిన పార్టీ శ్రేణులు

కూడేరు: మండలం నుంచి రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నేతలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ముందుగా కొర్రకోడుకు చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు కూడేరులో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి, తరలివెళ్లారు. ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు ఉన్నారు.



దొడగట్ట నుంచి తరలివెళ్తున్న నాయకులు



ఈస్ట్‌కోడిపల్లి నుంచి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కూడేరు: వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేస్తున్న కొర్రకోడు నేతలు



శెట్టూరు నుంచి తరలివెళ్తున్న నాయకులు



రాప్తాడు 'సిద్ధం' సభకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఉప సర్పంచ్ వన్నప్ప నాయకత్వంలో తరలివెళ్తున్న యువత

క్లుప్తంగా

దశభుజ మహా గణపతికి పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ఉరవకొండలో జిల్లా స్థాయి మహిళల ఇజితిమా



ఉరవకొండలో జరిగిన సున్ని ఇజితిమాలో పాల్గొన్న ముస్లిం మహిళలు

ఉరవకొండ: ఉరవకొండలోని జామియా తాసీరియా ఎడ్యుకేషన్, చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మహిళలు ఆదివారం పెద్ద ఎత్తున ఇజితిమా నిర్వహించారు. స్థానిక జామాలుద్దీన్ ఖాద్రీ దర్గా కాంపౌడ్ ఆవరణలో బాలికల జామీయాతాసీరియా మదరసా వద్ద ఇజితిమా పెద్ద ఎత్తున నిర్వహించారు. సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, కుతుబుద్దీన్ తబీబాబా, సయ్యద్ తాసీర్‌బాబాల ఆశీస్సులతో జిల్లా వ్యాప్తంగా అన్నీ ప్రాంతాల నుంచి ముస్లిం మహిళలు ఇజితిమాలో పాల్గొన్నారు. ఇజితిమాలో ఖిరాత్-ఏ-ఖురాన్ మజీద్ ఏనాత్‌లు నిర్వహించారు. అనంతరం మహిళలకు భోజనాలు ఏర్పాటు చేసి, సాయంత్రం దువా చేయడంతో ఇజితిమా విజయవంతంగా పూర్తయ్యింది.

ముద్దలాపురం చెరువుకు జలకళ



ముద్దలాపురం చెరువులోకి చేరిన నీరు

కూడేరు: గతేడాది వర్షాభావంతో ప్రాజెక్ట్‌ల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. ఇటీవల శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువ (హెచ్‌హెచ్ఎస్ఎస్)కు ప్రభుత్వం నీరు విడుదల చేయడం రికార్డుగా నిలుస్తోంది. హంద్రీ నీవా కాలువ పి.నారాయణపురం, చోళసముద్రం గుండా కుప్పం వరకు వెళ్లింది. గత నెల రోజులుగా హంద్రీ నీవా కాలువ గుండా నీరు ప్రవహిస్తోంది. 18 రోజుల క్రితం కూడేరు ముద్దలాపురం చెరువుకు అధికారులు నీరు విడుదల చేశారు. దీంతో ముద్దలాపురం చెరువుకు జలకళ వచ్చింది. ఈ చెరువు పూర్తిగా నిండితే పిల్ల కాలువ గుండా ఇప్పేరు చెరువుకు చేరుతుంది. ఈ రెండు చెరువుల్లో నీరు ఉంటే భూగర్భ జలాలు పెంపొంది సుమారు 10 వేల ఎకరాలకు పంటలకు సాగు నీరు అందుతుంది.

అనారోగ్యంతో వలంటీరు మృతి



రంజాన్ (ఫైల్)

ఉరవకొండ: మండలంలోని షేక్షానుపల్లికి చెందిన వలంటీరు రంజాన్ (45) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వలంటీరు మృతి పట్ల పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు సంతాపం తెలిపారు. వలంటీరు సేవలు మరవలేనివని రంజాన్ కుటుంబానికి అండగా ఉంటామని పార్టీ నాయకులు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



వన్నూరప్ప (ఫైల్)

విడపనకల్లు: మండలంలోని హావళిగికి చెందిన వన్నూరప్ప (52) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. వన్నూరప్ప ఐదెకరాల పొలాన్ని కౌలుకుతీసుకొని మిరప పంట సాగు చేశాడు. మూడేళ్లుగా పంటల సాగుకు బయటి వ్యక్తుల వద్ద, ఫర్టిలైజర్స్ షాపులో రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. పంట సరైన గిట్టుబాటు ధర లేక, అప్పు తీర్చేమార్గం లేక సతమతమయ్యేవాడు. శనివారం కుటుంబ సభ్యులెవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి, వెంటనే కర్ణాటకలోని బళ్లారి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పాల్తూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు భరత్‌రెడ్డి, గీతమ్మ, రాజమ్మ, కళావతి, రఘురాం,రాజశేఖర్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈవిషయాన్ని మాజీ ఎమ్మెల్యే సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లి, బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

శివాలయాల్లో మాఘమాస పూజలు



భోగేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం

వజ్రకరూరు: స్థానిక భోగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాఘమాస పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు, అభిషేకాలు, అర్చనలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. మండలంలోని జరుట్ల రాంపురంలోని జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ మాఘమాస పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున ఆలయాలకు చేరుకొని స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

వన్నూరుస్వామి గంధం వేడుకలు



గంధం వేడుకలకు పోటెత్తిన భక్తులు

కణేకల్లు: మండలంలోని జక్కలవడికిలోని దర్గాలో వన్నూరుస్వామి గంధం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామి సమాధికి నూతన వస్త్రాలు, పూలచద్దర్‌లు పరిచి, గంధం సమర్పించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్గాలో పూజలు జరిపించారు. గంధం వేడుకల్లో సర్పంచు శారదమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంత రెడ్డి, గిర్రపరెడ్డి, రామకృష్ణారెడ్డి, బోయ రమేష్, టైలర్ వెంకటేశులు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సోమవారం స్వామి షంషీర్ ఊరేగింపు జరగనుంది.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ 90 శాతం పూర్తి



కూడేరు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రభావతి

కూడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా నిలుస్తున్నాడు. పేదలకు జగనన్న కాలనీల పేరిట ఇంటి స్థలాలు కేటాయించి, పక్కా ఇళ్లు నిర్మించి సొంతింటి కల నెరవేర్చారు. తాజాగా జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన పేద మహిళల పట్టాలకు గ్రామ సచివాలయల్లోనే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇచ్చిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేలా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. సెలవు రోజుల్లోనూ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వలంటీర్లు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కూడేరు మండలంలో ఏడు సచివాలయాల పరిధిలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి 735 మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. ఆదివారం నాటికి రిజిస్ట్రేషన్ 90 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కూడేరు-1.2 సచివాలయ పరిధిలో 263 మందికి పట్టాలివ్వగా, 238 మందికి రిజిస్ట్రేషన్ చేశారు. ఉదిరిపికొండలో 150 మందికి గాను 135, ఇప్పేరులో 150 మందికి 133, తిమ్మాపురంలో 75 మందికి 58, గొటుకూరులో 39 మందికి 37, కమ్మూరులో 50 మందికి 46, చోళసముద్రంలో 8 మందికిగాను 6 మందికి పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

రాయదుర్గంలో ట్రాఫిక్ కష్టాలు



నిత్యం ట్రాఫిక్ సమస్య ఉండే వినాయక సర్కిల్

రాయదుర్గంటౌన్: పట్టణ నడిబొడ్డునున్న వినాయక సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పోలీసులు, ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతోపాటు భారీ వాహనాలు కూడా వినాయక సర్కిల్ మీదుగానే వెళ్లాల్సి వస్తోంది. దీంతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. సర్కిల్‌లో వాహన డ్రైవర్లు ఇష్టానుసారంగా బస్సులు తిప్పుకుంటూ ప్రజలు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. బళ్లారికి వెళ్లే ఆర్టీసీ సర్వీసులు, కర్ణాటక మొలకాల్మూరు వైపునకు వెళ్లే ప్రైవేటు, కర్ణాటక ఆర్టీసీ బస్సులు వినాయక సర్కిల్‌లోనే తిప్పుకుంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి. ప్రైవేట్ బస్సుల యజమానులతో పోలీసులు మాట్లాడుకొని, ట్రాఫిక్ సమస్యను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

● భానుడి భగభగ..



జనం లేక వెలవెలబోతున్న లక్ష్మీబజార్ ప్రధాన రహదారి

వేసవి ప్రారంభంలోనే భానుడి భగభగ మంటున్నాడు. మధ్యాహ్నం 12 గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏరియాల్లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల ప్రభావంతో విద్యార్థులు, ఉద్యోగులు, ఆటో, బస్సు, లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు, మేస్త్రీ, కూలీలు, తోపుడు బండ్ల వ్యాపారులు అవస్థ పడుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. – రాయదుర్గంటౌన్:

● కూల్ కూల్‌గా కళింగర..





మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన కళింగర

ఫిబ్రవరి నెలలోనే ఎండలు మండుతున్నాయి. ఎండ తీవ్రత ఉండడంతో జనం అల్లాడుతున్నారు. ఉక్కపోతతో చెట్ల నీడన సేదతీరాల్సి వస్తోంది. ఎండ తీవ్రతకు శీతల పానీయాలు తాగుతున్నారు. దీంతో కళింగర, పుచ్చకాయలు, కూల్ డ్రింక్స్ విరివిగా అమ్ముతున్నారు. దీంతో వ్యాపారులకు గిరాకీ పెరిగింది. కళింగర కాయలు అందుబాటులోకి లేకపోవడంతో కర్ణాటక ప్రాంతం నుంచి కొనుగోలు చేసి తెస్తున్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, అనంతపురం రహదారి బ్రిడ్జి వద్ద వ్యాపారులు అధికంగా పుచ్చకాయలు విక్రయిస్తున్నారు. – రాయదుర్గంటౌన్: